

**మోడల్ పిలుస్తోంది..**

బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో ఆంగ్లమాధ్యమ విద్యను అందిస్తున్న మోడల్ పాఠశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వివరాలు 8లో ▸



**మనతోనే సమాజంలో మార్పు**

సమాజంలో మార్పు మనతోనే ప్రారంభం కావాలని, మొదటగా మనం మారాలని అదనపు డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు అన్నారు. వివరాలు 8లో ▸



**చెక్.. 'ఢాం'**

అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపమైంది. ప్రభుత్వం రూ. కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### ఉర్సే షరీఫ్ ఉత్సవాలు ప్రారంభం

మొదటి రోజు చందన సమర్పణ



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు, ఆశ్రమ పీఠాధిపతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో ఉర్సే షరీఫ్ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదజ్ఞానామృత ఖవ్వాలి, చందనం, సుగంధం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం దీపాలంకరణోత్సవం, భజన కార్యాక్రమలు జరుగనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

### మల్లన్న ఆలయ ఏఈఓపై కమిషనర్‌కు ఫిర్యాదు



ఏఈఓపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ధర్మకర్తలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఏఈఓ అంజయ్యపై దేవాదాయ కమిషనర్ అనిల్ కుమార్‌కు ధర్మకర్తలు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మధు, కిరణ్ మాట్లాడుతూ ఏఈవోపై గతంలో ఆలయ నిధుల దుర్వినియోగం, ఫేక్ సర్టిఫికెట్ల ఆరోపణలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. అంతే కాకుండా అతనిపై రికవరీ కోటి రూపాయల వరకు ఉందన్నారు. వెంటనే కమిషనర్ స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

**ఒగ్గు పూజారులుగా అవకాశం కల్పించండి**

హైదరాబాద్‌కు చెందిన యాదవులకు కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఒగ్గు పూజారులుగా అవకాశం కల్పించాల ని ఏఈఓ అంజయ్య, ఎస్‌ఐ నాగరాజుకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్న తమ ఇంటి దైవమని, ఏటా జాతర సమయంలో కొమురవెల్లికి వచ్చి పట్నం వారం, లష్కర్‌వారం వేసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఒగ్గు పూజారులగా హక్కు కల్పించాలని కోరారు.

### ఈ నెలాఖరు వరకు పెండింగ్ చలాన్లపై రాయితీ



సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ

సిద్దిపేటకమాన్: వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లపై రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పోలీసు కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో వాహనాలపై ఉన్న ఈ పెండింగ్ చలానాలపై ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించిందని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై 80శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం, లారీలు, భారీ వాహనాలపై 60శాతం రాయితీ ప్రకటించినట్లు తెలిపారు. ఈ చెల్లింపులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఆమె కోరారు.

### ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో రైతులకు మేలు



నిర్మాణం పనులను పరిశీలిస్తున్న సోమిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయిల్‌పామ్ ఫార్మర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. నర్మెటలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ నిర్మాణం పనులను గురువారం సోమిరెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంగునూరు మండలం నర్మేటలో 62 ఎకరాల్లో రూ 300 కోట్లతో తలపెట్టిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులు చకచక సాగుతున్నాయన్నారు. పది కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేసేందుకు చేపట్టిన రిజర్వాయిర్, కాంటా, ప్లాట్ ఫారం, అధికారులు, సెక్యూరిటీ గదుల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఆయన వెంట కృష్ణారెడ్డి, పరుశరాములు, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# పర్యాటకం.. నిర్లక్ష్యమే ఆటంకం

జిల్లాలోని పర్యాటక రంగంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. రిజర్వాయర్లు, అర్బన్ పార్కులు, ఇతర టూరిజం స్పాట్లను అభివృద్ధి పరిచే కార్యాచరణ ముందుకుసాగడం లేదు. గతేడాది మార్చి నెలలో అధికారులు కొన్ని చోట్ల అభివృద్ధి, ఇతర పునరుద్ధరణ పనులపై హడావిడి చేసినా, అవి కొద్ది రోజులకే పరిమితమయ్యాయి. దీంతో పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. నిధుల విడుదలలోనూ తీవ్ర జాప్యం నెలకొన్నది. ఈ నేపథ్యంలో పర్యాటక రంగం అభివృద్ధిపై జిల్లా ప్రజలు కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు.

**కొత్త హంగులు ఎప్పుడో?**

- ముందుకు సాగని కార్యాచరణ
- అభివృద్ధికి నోచుకోని రిజర్వాయర్లు
- అర్బన్ పార్కులపైనా అలసత్వం
- నిధుల విడుదలలోనూ తీవ్ర జాప్యం
- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

గజ్వేల్: నగరానికి సమీపంలో ఉన్న సిద్దిపేట జిల్లా పర్యాటక రంగానికి నెలవు. ఇందులో రిజర్వాయర్లు, అర్బన్ పార్కులు కీలకం. కాని కొన్నేళ్లుగా వీటిని సందర్శిస్తున్న వారి సంఖ్య పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక దశలో వీటి నిర్వహణ కూడా భారంగా మారుతోంది. ఈ దుస్థితిని నివారించేందుకు అధికారులు సంకల్పించారు. అయితే ఈ కార్యాచరణ ముందుకుసాగడం లేదు. ప్రధానంగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ అటవీ ప్రాంతంలోని 292.5 ఎకరాల్లో అర్బన్ పార్కును సుందరంగా నిర్మించారు. 2021 నుంచి ఈ పార్కును అందుబాటులోకి తెచ్చారు. ఎక్కడాలేనివిధంగా ఇక్కడ రాశీ వనం ఏర్పాటుచేశారు. ఇందులో 12 రాశులకు సంబంధించిన చెట్లను నాటి పెంచారు. నక్షత్ర వనం పేరిట మరో ప్రత్యేక నిర్మాణం సైతం ఇక్కడ ఉంది. నక్షత్రం ఆధారంగా పూజించాల్సిన వృక్షాలను ఈ వనంలో అందుబాటులో ఉంచారు.

**స్మృతి వనం..**

వీటితో పాటు పెద్దల స్మారకార్థం మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకునే అవకాశాన్ని కల్పించే దిశలో స్మృతి వనాన్ని సైతం నిర్మించారు. ఈ వనంలో తమ పెద్దల పేరిట నాటిన మొక్కల వద్ద వారి స్మృతులను గుర్తు చేసుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ పార్కులో స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ... యోగ, వ్యాయామం చేసుకునే వసతులను కల్పించనున్నారు. దీంతో పాటు నడకదారులు, సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నింటికీ తోడుగా ధ్యానమందిరాన్ని ఏర్పాటు చేశారు. పార్కును సందర్శించే వారికోసం ఇక్కడ అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశారు. ఈ పార్కులో ప్రతి నిర్మాణం సహజత్వం ఉట్టిపడేలా కర్రలు, చెట్లను తలపించే విధంగా కాంక్రీటు నిర్మాణాలు జరిగాయి. అదేవిధంగా పార్కులో బస చేసేందుకు అధునాతన సౌకర్యాలతో పది కాటేజీలు నిర్మించారు. కానీ ఈ పార్కును ఏడాదిలో సందర్శిస్తున్న వారి సంఖ్య 3వేలకు మించడం లేదు.



వినియోగానికి నోచుకోని గజ్వేల్ అర్బన్ పార్కులోని కాటేజీ

**కలెక్టర్ పరిశీలన..**

ఇన్ని హంగులున్నా పార్కుకు ఎందుకు రావడం లేదని గతేడాది మార్చి నెలలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ స్వయంగా పరిశీలన జరిపారు. పార్కులో కాటేజీలు నిరుపయోగంగా ఉండటం, సౌకర్యాలు సక్రమంగా లేవని గుర్తించారు. సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టి వాటిని వెంటనే వినియోగంలో తేవాలని ఆదేశాలివ్వడంతో ఆ దిశగా అరకొరగా పనులు సాగాయి. ఫర్నిచర్, మరిన్ని మెరుగైన వసతులను కల్పిస్తేనే వినియోగంలోకి వచ్చే అవకాశమున్నది. మరోవైపు కుకునూర్‌పల్లి మండలం లకుడారం స్టేజీ దాటిన తర్వాత రాజీవ్‌రహదారిపై నుంచి మల్లన్న సాగర్ వరకు ప్రస్తుతమున్న రోడ్డును విస్తరించాలన్న ప్రతిపాదన సైతం ముందుకుసాగటం లేదు. రాజీవ్‌రహదారి నుంచి మల్లన్నసాగర్ వరకు వెళ్లే క్రమంలో మూడు కిలోమీటర్ల దూరంలో రిజర్వాయర్ అందాలతోపాటు అటవీ అందాలను వీక్షించడానికి ఏర్పాటు చేసిన వాచ్ టవర్ పనులు నిధుల కొరత వల్ల ఆగిపోయాయి. ఇవేకాకుండా కొండపోచమ్మ సాగర్‌తోపాటు జిల్లాలోని ఇతర టూరిస్ట్ స్పాట్లలో సందర్శకుల సంఖ్యను పెంచే కార్యాచరణపై నిర్లక్ష్యం అలుముకుంది. ఈ అంశాలపై గజ్వేల్, సిద్దిపేట ఫారెస్ట్ రేంజి అధికారులు కిరణ్‌కుమార్, ఇక్రామొద్దీన్‌లను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పర్యాటక రంగ అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చూస్తామన్నారు.

# క్లీన్ సిటీ పురస్కారం

- సిద్దిపేట మున్సిపాలిటీకి జాతీయ అవార్డు
- అందుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ సంపత్

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీకి క్లీన్ సిటీ పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి మనోజ్ జోషి చేతుల మీదుగా ఛైర్‌పర్సన్ మంజుల రాజనర్స్, కమిషనర్ సంపత్ కుమార్ అవార్డు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సర్వేక్షన్ పేరిట అవార్డులు ఇస్తున్న విషయం విదితమే. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో చెత్త సేకరణ, చెత్త పునర్వినియోగం, జనాభాకు సరిపడేలా సులబ్ కాంప్లెక్స్‌లు, బహిరంగ మల విసర్జన రహిత పట్టణం, మొక్కల పెంపకం, తదితర ప్రాజెక్టుల అమలు ఆధారంగా ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షన్ క్లీన్ సిటీగా సిద్దిపేట ఎంపికైంది. లక్ష జనాభా కేటగిరీలో దక్షిణ భారతదేశంలో సిద్దిపేట కు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీశ్‌రావు తోడ్పాటు, పాలకవర్గం సహకారం, ప్రజల భాగస్వామ్యం వల్ల ఈ అవార్డు దక్కిందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. మున్సిపాలిటీకి జాతీయ అవార్డు దక్కడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. సమష్టి పనితనానికి అవార్డులు నిదర్శనమన్నారు. బల్దియా పాలకవర్గం, అధికారులు, సిబ్బందిని అభినందించారు.

## ముందస్తు సంక్రాంతి



జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దులు, హరిదాసుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. పాఠశాల ఆవరణలో భోగిమంటలు వేశారు. అంతటా పండుగ సందడి కనిపించింది.

-ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మిరుదొడ్డి



కొండపాక బాలికల పాఠశాలలో భోగి మంటలు, (ఇన్‌సెట్) మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో సంబురాలు

# పుస్తక పఠనంతో మేధాశక్తి

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- కుకునూరుపల్లిలో గ్రంథాలయం ప్రారంభం

కొండపాక(గజ్వేల్): పుస్తక పఠనం మేధాశక్తిని పెంచుతుందని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో సర్పంచ్ జయంతితో కలిసి గురువారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గరీమా అగర్వాల్ మాట్లాడుతూ రోజూ గంట పాటు గ్రంథాలయానికి విద్యార్థులు వెళ్లేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. గ్రంథాలయాల్లో వీర యోధులు, స్వాతంత్ర్య పోరాట యోధుల చరిత్రలు తెలిపే పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం హైస్కూల్‌ను సందర్శించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ వీరరాజు, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.



గ్రంథాలయ ప్రారంభోత్సవంలో అదనపు కలెక్టర్ తదితరులు

# ఓబన్న స్ఫూర్తితో ముందుకు వెళ్దాం

- మన పిల్లలకు మంచి భవిష్యత్ ఇద్దాం
- జెడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: ఓబన్న స్ఫూర్తితో వడ్డెరలు ముందుకు సాగాలని, తమ పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చేలా కృషి చేయాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ రోజా శర్మ అన్నారు. గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక విపంచి ఆడిటోరియంలో వడ్డె ఓబన్న 217వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం జెడ్పీ ఛైర్‌పర్సన్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కులం అనేది మనం ఏర్పాటు చేసుకున్న హద్దులన్నారు. ఎందరో త్యాగధనుల పోరాటం వల్ల స్వరాజ్యం వచ్చిందన్నారు. వడ్డెరలు కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉంటుందని, పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచన చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. బలహీన వర్గాల్లో మరింత చైతన్యం అవసరమన్నారు. ప్రభుత్వం ఇచ్చే లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ, మున్సిపల్ కౌన్సిలర్ కవిత, బీసీ సంఘం నాయకులు వర్మ, శ్రీహరి, మహేందర్‌పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ

# పథకాల సద్వినియోగంతోనే ప్రగతి

- కేంద్ర పథకాల అమలుతీరు భేష్
- జౌళిపరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్‌గుప్తా

వర్గల్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వ పథకాలు బాసటగా ప్రజలు వికసిత్ భారత్‌వైపు పురోగమించాలని కేంద్ర జౌళీ పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్‌గుప్తా పిలుపునిచ్చారు. గురువారం వర్గల్ మండలం చౌదరిపల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్రప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆయా శాఖలు ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలుతీరు తెలుసుకున్నారు. సాధించిన ఫలితాలపై పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. మండల మహిళా సమాఖ్యకు బ్యాంకు ద్వారా రూ. 2.15 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు చక్కగా వినియోగించుకోవడమే కాకుండా మరికొందరికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పథకాల అమలుకు కృషి చేస్తున్న అధికారులకు కితాబునిచ్చారు. ప్రత్యేకంగా వైద్యారోగ్యశాఖ కృషి అభినందనీయమన్నారు. పథకాలు వారధి మాత్రమేనని, వాటిని సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజల్లో మార్పు కన్పిస్తుందన్నారు. దేశాభివృద్ధి అంటే ప్రజలు అభివృద్ధి చెందడమే అన్నారు. ఉజ్వల గ్యాస్, ఇన్సూరెన్స్, బ్యాంక్ రుణాలు, తదితర పథకాలను సామాన్య ప్రజలు సైతం విరివిగా వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలుస్తున్న కేంద్ర పథకాలపై మీడియా ద్వారా విస్తృత ప్రచారం జరగాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు తాము అందిస్తున్న సేవలను ఈ కార్యక్రమంలో వివరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ అరుణ్‌జ్యోతి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్, సీడీపీఓ వెంకటరాజమ్మ, జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్, ఎంపీపీ లత, సర్పంచ్ లలిత, ఎంపీటీసీ సజనిత, ఎస్‌బీఐ మేనేజర్ సాయికుమార్, బరోడా బ్యాంకు మేనేజర్ మౌనిక, ఎంపీడీవో స్వర్ణకుమారి, తహశీల్దార్ హరికిరణ్, ఏపీఎం యాదగిరి, ఏఓ శేషశయన తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రజలు భారీగా హాజరయ్యారు.




చౌదరిపల్లిలో మండల మహిళా సమాఖ్యకు చెక్కు అందజేస్తున్న అజయ్‌గుప్తా



వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలో పాల్గొన్న ప్రజలు

# 'తొలిమెట్టు'ను నిలిపివేయండి

**టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి**

చేర్యాల(సిద్దిపేట): ఉపాధ్యాయుల మానసిక ఒత్తిడికి కారణమవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను తక్షణమే నిలిపివేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమాండ్ల రాంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న ఉపాధ్యాయులే కష్టపడి విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. అలాగే నూతన పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాపురెడ్డి, సంఘం ప్రతినిదులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి సంక్రాంతి

ఆర్టీసీకి ముందుగానే సంక్రాంతి పండుగ కళొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో సిద్దిపేట పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్ గురువారం ప్రయాణికులతో కిక్కిరిసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు హాస్టల్ నుంచి ఇంటిబాట పట్టారు.

-సాక్షి స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, సిద్దిపేట







పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

## క్లుప్తంగా

### ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద

**ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి**



పుస్తకాన్ని అందజేస్తున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): స్వామి వివేకానంద అందరికీ ఆదర్శప్రాయుడని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. నేడు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానంద పుస్తకాన్ని ములుగు ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో రెండో బహుమతి



స్ఫూర్తి

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో జిల్లావాసి స్ఫూర్తి ఉపన్యాస పోటీల్లో రెండో బహుమతి సాధించినట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అనుమతితో డిసెంబర్ 22న మెదక్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో స్ఫూర్తి ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 5, 6వ తేదీల్లో హైదరాబాద్‌లోని శిల్పారామంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనట్లు పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన హైదరాబాద్‌లోని యువజన సర్వీసుల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు డైరెక్టర్ చేతుల మీదుగా స్ఫూర్తి బహుమతి అందుకోనున్నట్లు తెలిపారు.

### క్లీ నెస్ట్ విభాగంలో హుస్నాబాద్‌కు 3వ స్థానం

హుస్నాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హుస్నాబాద్ మున్సిపాలిటీకి క్లీనెస్ట్ సిటీ విభాగంలో మూడవ స్థానం దక్కింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023కి గాను భారతదేశంలోని అన్ని పట్టణాలతో పోటీపడగా దక్షిణ భారతదేశంలో 15,000 నుంచి 25,000 లోపు జనాభా గల పట్టణాల్లో చూడగా హుస్నాబాద్ మూడో స్థానం దక్కించుకుంది. హుస్నాబాద్ మున్సిపాలిటీ మూడోసారి ర్యాంకు సాధించడంపై రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ భవిష్యత్‌లో మరెన్నో అవార్డులు సాధించాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. అలాగే, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

### విశ్వవిద్యాలయాలు జ్ఞాన కేంద్రాలుగా ఉండాలి

పటాన్‌చెరు టౌన్: విశ్వవిద్యాలయాలు కర్మాగారాలుగా కాకుండా జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా ఉండాలని యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్, ఇండియా పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ జంధ్యాల బీజీ తిలక్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్ఎస్)లోని సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా 'విశ్వవిద్యాలయాలు అంతరించిపోతున్న జాతులు' అనే అంశంపై తిలక్ ఉపన్యాసం చేశారు. విజ్ఞాన వృద్ధిని పెంపొందించడానికి, మేధో ఉత్తేజాన్ని అందించడానికి విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తిని కొనసాగించాలని అధ్యాపకులకు, విద్యార్థులకు సూచించారు. ఈ ఆతిథ్య ఉపన్యాసానికి అధ్యాపకులు, విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది.

# క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన 49వ జూనియర్ కబడ్డీ చాంపియన్ షిప్



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర 49వ జూనియర్ అంతర్‌జిల్లా కబడ్డీ చాంపియన్ షిప్–2024 పోటీలు గురువారం రాత్రి గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ పక్కన గల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి పోటీలను ప్రారంభించగా... రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గజ్వేల్ ప్రాంతం వేదికవడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలన్నారు. పోటీల్లో బాలుర, బాలికల విభాగం నుంచి ఒక్కో జట్టు చొప్పున మొత్తం 33 జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది వరకు క్రీడాకారులు పాల్గొంటున్నారు. మూడ్రోజుల పాటు జరుగనున్న పోటీల్లో భాగంగా మొదటి రోజు బాలికల విభాగంలో సిద్దిపేట–సంగారెడ్డి జట్లు, బాలుర విభాగంలో సిద్దిపేట–నిజామాబాద్ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అమరావతి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, క్రీడాబాధ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న క్రీడాకారులు



ముత్యాల హారంలా సాలె గూడు



చందమామలా ఉదయించే సూర్యుడు

### ప్రకృతి అందం.. రమణీయం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రకృతి అందాలను చూసినప్పుడల్లా మనసును కట్టి పడేస్తాయి. ఉదయం మంచు పరుచుకున్న గట్టి పరకలు, సాలె గూళ్ల ముత్యాలను తలపిస్తాయి. ఆకుల చాటున, చెట్టు పుట్టల మాటున కనిపించే ఉదయ భానుడు సైతం చందమామను తలపిస్తూ కనువిందు చేస్తాడు. కిలకిల రావాలతో తెల్లవారే పల్లెల్లో పక్షుల సందడిని చూస్తే మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. ఇలాంటి ప్రకృతి అందాలను చూస్తే ప్రతీ ఒక్కరి మనసుకు ఆనందం కలుగుతుంది. అలాంటి ప్రకృతి అందాలను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.



పక్షుల సందడి

# న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయండి



ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన న్యాయ సంహిత (హిట్ అండ్ రన్ ) చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద డైమాన్ లారీ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు నిరసన తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్లయ్య మాట్లాడుతూ రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడేవిధంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన న్యాయ సంహిత బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రైవేట్ పబ్లిక్, ట్రాన్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 14వరకు నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ చట్టం వల్ల డ్రైవర్ల ప్రాణాలకు ముప్పుందని, వారు కుటుంబాలను పోషించుకునేందుకే ఈ వృత్తిలోకి వస్తున్నారన్నారు. డ్రైవర్ల కుటుంబాలకు భద్రత లేదని, వారికి సైతం గుర్తింపు కార్డులను ఇవ్వడంతో పాటు ఆరోగ్య, ప్రమాదభీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రమేష్, రాజు, రాములు పాల్గొన్నారు.

### అయోధ్య రామ మందిరం నమూనా

వర్గల్(గజ్వేల్): విద్యార్థులు సృజన చాటారు. ఉపాధ్యాయులు తోడుగా నిలిచారు. వర్గల్ మండలం బొర్రగూడెం పాఠశాల ఆవరణలో అయోధ్య రామమందిరం నమూనా చిత్రీకరించారు. గురువారం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. 22న అయోధ్య రామ మందిరంలో హనుమాన్, లక్ష్మణ సహిత సీతా రామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో రామమందిర నిర్మాణ నమూనా రంగవల్లిని ఆవిష్కరించారు.



# మనతోనే సమాజంలో మార్పు



సమావేశంలో మాట్లాడుతున్న అందె శ్రీనివాసరావు

- లింగభేదములు లేకుండా ముందుకెళ్లాలి
- అదనపు డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు

సిద్దిపేట ఎడ్యుకేషన్:సమాజంలో మార్పు మనతోనే ప్రారంభం కావాలని, అందుకోసం మొదటగా మనం మారాలని అదనపు డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు అన్నారు. జండర్ సెన్సిటైజేషన్ ఫర్ యూత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌లో 42 మంది విద్యార్థులకు రెండురోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ సీఈవో శివకుమారి మాట్లాడుతూ.. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, చట్టాలకు సంబంధించిన పుస్తకాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ కనుక చంద్రం వన్ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, పోలీస్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం వైఖరి మార్చుకోవాలి

- కొత్త క్రిమినల్ చట్టాలు వెనక్కి తీసుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ నేడు కొత్త క్రిమినల్ చట్టాలు తీసుకురావడంతో అనేక మంది డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే క్రిమినల్ చట్టాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. కేవలం 5 కార్పొరేట్ శక్తులకు, వ్యక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలు అప్పజెప్పడం, అమ్మేయడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్రం రైల్వే, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ సంస్థలు కార్పొరేట్లు అప్పగించారని గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం లేకుండా చేస్తానని చెప్పిన మోడీ ప్రభుత్వం నేడు నిరుద్యోగం పెంచి పోషిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ రెడ్డి, బస్వరాజు, ఉపాధ్యక్షుడు మల్లేశం, కడారి నాగరాజు, కోశాధికారి నర్సమ్మ, సహాయ కార్యదర్శిలు నాగేందర్ రెడ్డి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శలో దరఖాస్తులకు ఆహ్వానం

**ఆన్‌లైన్‌లో స్వీకరణ**

- నేటి నుంచి ఫిబ్రవరి 22 వరకు
- ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష
- 6వ తరగతిలో వంద సీట్లు
- జిల్లాలోని 14 పాఠశాలల్లో ఖాళీలు



లచ్చపేట ఆదర్శ పాఠశాల

దుబ్బాక : ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు ఓ వరం. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యను అందిస్తోన్న ఆదర్శ(మోడల్) పాఠశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఆదర్శ పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 2024–25 సంవత్సరానికి గాను 6వ తరగతిలో 100 సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న పరిమిత సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు నేటి నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు.

**జిల్లాలో 14 పాఠశాలలు**

సిద్దిపేట జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలున్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి 100 సీట్లు ఉన్నాయి. జిల్లాలో దుబ్బాక, మిరుదొడ్డి, ఇర్కోడ్, చిన్నకోడూర్, నంగునూర్, కొండపాక, గజ్వేల్, చేర్యాల, మద్దూర్, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ, దౌల్తాబాద్ మండలాల్లో పాఠశాలలున్నాయి. మిగిలిన తరగతులకు సంబంధించి ఖాళీలను భర్తీ చేయనున్నారు.

**ఏప్రిల్ 1 నుంచి హాల్ టికెట్లు**

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 1 వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. 6 తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 7వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125 ఫీజు చెల్లించాలి.

**పరీక్ష విధానం**

ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో వంద ప్రశ్నలకు వంద మార్కులు ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆంగ్లం పాఠ్యాంశాలల్లో ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలుంటాయి. 7 నుంచి 10వ తరగతి వారికి గణితం, సామాన్య, సాంఘీక శాస్త్రం ఇంగ్లిష్ నుంచి వంద ప్రశ్నలు వస్తాయి. ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటలపాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**



ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతికి వంద సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు పరిమిత సీట్లకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నాణ్యమైన విద్య, చక్కని క్రమ శిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న పాఠశాలలో విద్యార్థులను చేర్పేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

– సుప్రియ, ప్రిన్సిపాల్, లచ్చపేట

# నివేశన స్థలాన్ని ఇప్పించండి

**సర్పంచ్ కాళ్లు మొక్కిన గ్రామస్తుడు**



సర్పంచ్ కాళ్లు మొక్కుతున్న బాధితుడు సమ్మయ్య

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ గ్రామానికి చెందిన కోనేటి సమ్మయ్య తమ తాతల నుంచి వచ్చిన నివేశన స్థలాన్ని మాకే ఇవ్వాలని కోరుతూ గురువారం గ్రామ సర్పంచ్ మొండయ్య కాళ్లు మొక్కాడు. గ్రామ పంచాయతీకి ఆనుకొని తమకు గతంలో గుడిసె ఉండేదని సుమారు 30 ఏళ్ల క్రితం హన్మకొండకు బతుకుదెరువు కోసం వెళ్లినట్లు బాధితుడు తెలిపారు. తమ స్థలంలో ఇప్పుడు గ్రామ సర్పంచ్ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ పీఆర్ ఏఈకి ఫిర్యాదు చేసినట్లు వాపోయాడు. సర్పంచ్ మొండయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలంలోనే గ్రామ పంచాయతీ భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొందరు రాజకీయ కుట్రతో వివాదం చేస్తున్నారని ఆరోపించారు.

# సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- టాస్క్‌లు, కమీషన్ల పేరుతో మోసం
- రూ.16 లక్షల 92 వేలు పోగొట్టుకున్న బాధితులు

పటాన్ చెరుటౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని కేఎస్ఆర్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ డిసెంబర్ 19వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఒక వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.3వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేశాడు. ఉద్యోగి పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.7 లక్షల 53 వేలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

**రూ. 8 లక్షల 14 వేలు..**

అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడా సృజన లక్ష్మీనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి నవంబర్ 4వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేసి, నగదు ఇన్వెస్ట్ చేశాడు. ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేస్తూ మొత్తం రూ. 8 లక్షల 14 వేలు చెల్లించాడు. తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**రూ.1.25 లక్షలు**

పటేల్‌గూడాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 2 వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. ఉద్యోగి తన వివరాలను నమోదు చేసి, ఇచ్చిన టాస్క్‌లు చేస్తూ మొత్తం రూ. లక్ష 25 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### స్కూటీ, ఎక్సెల్ వాహనం ఢీ..

**ఒకరు మృతి, మరో ముగ్గురికి గాయాలు**



శంకర్ గౌడ్ (ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): స్కూటీ, ఎక్సెల్ వాహనం రెండూ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన హత్నూర మండలం దేవులపల్లి బస్ స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవులపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు గౌడ్, శంకర్ గౌడ్ స్కూటీపై దౌల్తాబాద్ నుంచి సొంత గ్రామం దేవులపల్లికి వస్తున్నారు. ఇదే సమయంలో హత్నూర నుంచి నస్తీపూర్ గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి గోపాల్, నర్సమ్మ దంపతులు స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో దేవులపల్లి బస్‌స్టేజీ సమీపానికి రాగానే స్కూటీ, ఎక్సెల్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో శంకర్‌గౌడ్ (40)అక్కడికక్కడే మృతి చెందాడు. గోపాల్, నర్సమ్మ, ఆంజనేయులు గౌడ్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ సుభాష్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

**వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. హత్నూరలో చెట్టుకు ఒకరు ఉరి వేసుకోగా, సదాశివపేటలో మరొకరు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.**



ప్రభాకర్ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చాకలి ప్రభాకర్ అలియాస్ బబ్లూ (30) జీవన ఉపాధి కోసం సంగారెడ్డి పట్టణంలో నివాసం ఉండేవాడు. బుధవారం స్వగ్రామం వడ్డేపల్లి వచ్చాడు. వ్యక్తిగత కారణాలతో గురువారం తుర్కల ఖానాపూర్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కూతురితోపాటు భార్య మహేశ్వరి ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

**చెరువులో దూకి..**

సదాశివపేట(సంగారెడ్డి): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సదాశివపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హరిజనవాడకు చెందిన జంగిలి రవి(35) కూరగాయల మార్కెట్‌లో పని చేస్తుంటాడు. బుధవారం రాత్రి కుటుంబ కలహాలతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతసేపు అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కలా వెతికినా ఆచూకీ లభించలేదు. అతడికి ఫోన్ చేయగా వేరే వ్యక్తి లిఫ్ట్ చేసి పట్టణ పరిధిలోని ఊబచెరువు గట్టుపై ఫోన్ దొరికిందని చెప్పాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య అనసూజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# మట్కా జూదం నిర్వాహకుడి అరెస్టు

**రూ.లక్ష నగదు, సెల్‌ఫోన్ సీజ్**

జహీరాబాద్: మట్కా జూదం నిర్వహిస్తున్న నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఎండీ రఫీ(30) మట్కా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకొని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడి వద్ద రూ.లక్ష నగదు, సెల్ ఫోన్ సీజ్ చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామన్నారు. గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ జనగాంకి దగ్గరలో Farm Land చ॥గ॥ 2100/- DTCP చ॥గ॥ 3600/- లాంచింగ్ ఆఫర్‌తో గలవు. భూమి విలువ తెలిసిన వారు త్వరపడి తక్కువ ధరకే Plot కొని ఆనందించగలరు. Ph: 7416591078 [H-801455]

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926. [M-1167592]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.